# ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యేదెన్నడు..



2



2

# 'పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీయవద్దు'



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## 16న దిశ సమావేశం

**అక్షరటుడే, ఇందూరు:** ఎంపీ ధర్మపురి అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు డీఆర్డీవో సాయాగౌడ్ తెలిపారు. సమావేశం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. కావున సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.





## నిజాంసాగర్ నాలుగు గేట్ల ఎత్తివేత

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. దీంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఉమ్మడి మెదక్, కామారెడ్డి జిల్లాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మంజీర నదికి వరద పెరిగింది. ప్రస్తుతం నిజాంసాగర్‌లోకి 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు నాలుగు వరద గేట్లను ఎత్తి అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 (17.80 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 1404 (17. 78 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

### పోచారంలోకి ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురిసిన వర్షాలతో పెద్దవాగు, గుండారం వాగు, పాముల వాగు ద్వారా డ్యాంలోకి భారీగా వరద వస్తోంది. జలాశయంలోకి 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధాన కాలువకు 50 క్యూసెక్కుల వదులుతున్నారు. మిగతా నీరు అలుగుపై నుంచి పారుతోంది.



## సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్‌లో ఉన్న సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీడీఎస్ రికార్డుల్లో పొందుపర్చిన వివరాలకు అనుగుణంగా ఔషధ నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలకు వాటిని ఎలా చేరవేస్తారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండెంట్ వచ్చిన వెంటనే తాత్సారం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఔషధాలను చేరవేయాలని, ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫార్మసిస్ట్ గంగాధర్‌ను ఆదేశించారు. ఆస్పత్రుల వ్యర్థాలను నిబంధనలకు అనుగుణంగా సరైన విధానంలో డిస్పోజ్ చేయాలని.. అలా చేయని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. జక్రాన్ పల్లి మండలం పడకల్ శివారులో మెడికేర్ సర్వీసెస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ వేస్టేజీని నిర్వీర్యం చేసే ప్లాంట్‌ను సందర్శించారు. ప్రతిరోజూ ఎన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వ్యర్థాలను సేకరిస్తున్నారు.




# పట్టణాల్లో పట్టని ప్రణాళిక..

▸ మున్సిపాలిటీల్లో పర్యవేక్షణ కరువు ▸ పెండింగ్‌లో దరఖాస్తులు ▸ పట్టించుకోని ఉన్నతాధికారులు

| పురపాలిక | ఇళ్లు | వార్డులు | పోస్టులు | విధుల్లో ఉన్నవారు |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | 81,000 | 60 | 19 | 04 |
| బోధన్ | 18,500 | 38 | 06 | 04 |
| ఆర్మూర్ | 22,780 | 36 | 04 | 02 |
| భీమ్‌గల్ | 5,960 | 12 | 0 | 0 |
| కామారెడ్డి | 26,949 | 49 | 06 | 02 |
| బాన్సువాడ | 10,260 | 19 | 0 | 0 |
| ఎల్లారెడ్డి | 5,490 | 12 | 0 | 0 |

**మున్సిపాలిటీల్లో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది పాత్ర అత్యంత కీలకం. ఎక్కడ అక్రమ కట్టడాలు చేపట్టినా, అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగినా వీరే అడ్డుకట్ట వేయాలి. ముఖ్యంగా భవిష్యత్తులో జనాభా అవసరాల దృష్ట్యా పట్టణం లేదా నగరాన్ని అభివృద్ధి చేయడంలో వీరి ప్రణాళిక అత్యంత కీలకం. ఇంతటి ప్రాధాన్యత కలిగిన పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల పనితీరు విమర్శలకు తావిస్తోంది. పలుచోట్ల సిబ్బంది కొరతతో విభాగం నామమాత్రంగా మారింది.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**

మున్సిపాలిటీల్లో పట్టణ ప్రణాళికా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలున్నాయి. నిజామాబాద్ నగరపాలక సంస్థలో తొమ్మిది గ్రామాల విలీనం తర్వాత డివిజన్ల సంఖ్య 60కి పెరిగింది. పునర్విభజనకు ముందు 50 డివిజన్లకు కేటాయించిన క్యాడర్ స్ట్రెంత్ ఇప్పటికీ అలానే ఉంది. పరిధి విస్తరించిన క్రమంలో నిర్మాణాలు, ఆక్రమణల గుర్తింపునకు పట్టణ ప్రణాళిక విభాగంలో పోస్టులు పెంచాలి. కానీ, ఉన్న సిబ్బందితోనే నెట్టుకురావడంతో 81 వేలకు పైగా నివాస, వాణిజ్య సముదాయాలు ఉన్న నగరంలో పర్యవేక్షణ సాధ్యమవడం లేదు.

నగరంలో నిత్యం పదుల సంఖ్యలో కొత్త ఇళ్ల నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తులు వస్తుంటాయి. అలాగే అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు, కబ్జాలపై విచారణలు చేయాల్సి ఉంటుంది. కానీ అందుకు తగ్గట్టుగా అధికారులు, సిబ్బంది లేరు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసే టౌన్ ప్లానింగ్, టీపీబీవోలు ఇలా ఏడు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు ఆరుగురికి గాను కేవలం ఇద్దరే ఉన్నారు.

### అంతటా అదే తీరు..

బోధన్ పట్టణంలో 8 పోస్టులకు ఇద్దరే పని చేస్తున్నారు. ఆర్మూర్ టీపీఎస్‌కు భీమ్‌గల్‌లో ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఆయన అక్కడ ఒక్క రోజు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. బాన్సువాడలో ఒకరోజు పనిచేస్తున్నారు. మెదక్ మున్సిపాలిటీ టీపీఎస్ ఎల్లారెడ్డిలో వారానికి ఒకరోజు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. కామారెడ్డిలో పట్టణ ప్రణాళిక విభాగంలో ఆరుగురు ఉద్యోగులకు కేవలం ఇద్దరే ఉన్నారు. ఈ మున్సిపాలిటీలో ఏడు గ్రామాలు విలీనమై.. 49 వార్డులకు పెరిగాయి. పరిధి పెరిగినా సిబ్బంది లేక పర్యవేక్షణ పూర్తిగా గాడి తప్పుతోంది.

### అధికారిక పనుల్లో బిజీ..

అన్ని మున్సిపాల్టీలలో నిత్యం ప్రజల నుంచి భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తులు వస్తూనే ఉంటాయి. కాగా ఆయా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులివ్వాల్సి ఉంటుంది. బల్దియాలో నెలలో 20 నుంచి 50 భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తులు వస్తుంటాయి. ప్రభుత్వ జాగాల్లో అక్రమ నిర్మాణాలు, నిర్మాణాల్లో నిబంధనల ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులు విచారించాల్సి ఉంటుంది.

డిజిటల్ సర్వే, నాలాలు, చెరువుల ఆక్రమణల గుర్తింపు విధులను సైతం వీరికే కేటాయించారు. నెలల తరబడి నాళాలు చెరువుల వెంట తిరుగుతూ.. ఆక్రమణలు గుర్తించారు. ఆ సమయంలో మున్సిపల్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉన్న కొద్దిమంది వేర్వేరు పనులు అప్పగించడంతో వాటికే బిజీగా అవుతున్నారు.

### కానరాని ఎన్‌ఫోర్స్‌మెంట్

టీఎస్ బీపాస్ అమల్లోకి వచ్చాక కీలక మార్పులు జరిగాయి. 2021 నుంచి భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలకు స్థానిక తహశీల్దార్ నేతృత్వంలో టీపీవో, ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖ ఏఈ, అగ్నిమాపకశాఖ అధికారి సభ్యులుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశారు. వివిధ శాఖల భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ బృందం సమన్వయంతో పనిచేయాలి. వచ్చిన ఫిర్యాదులతో పాటు పట్టణ ప్రణాళిక విభాగం ఫిర్యాదులను సైతం క్షేత్రస్థాయిలో విచారించి అక్రమ నిర్మాణాలను ఆపాలి. కానీ, ఆయా శాఖల అధికారులు తమ తమ విధుల్లో బిజీగా మారుతున్నారు. కొందరైతే ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోకుండా వదిలేస్తున్నారు.

## మైనార్టీల కోసమే బీసీ రిజర్వేషన్ బిల్లు



**అక్షరటుడే, ఇందూరు:** మైనారిటీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లు తెచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డితో పాటు ఇందూరు జిల్లాలో అనేక మండలాలు, గ్రామాలు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయాయన్నారు. కానీ ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ఇతర మంత్రులు, నాయకులు కనీసం అటువైపు కన్నెత్తి చూడట్లేదని విమర్శించారు. కామారెడ్డి పక్కనే ఉన్న సిరికొండ, ధర్పల్లి, భీమ్‌గల్‌లో కనీసం ప్రజలు ఎలా ఉన్నారని కూడా సమీక్షించలేదని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నాయకులు కేవలం ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్తున్నారే తప్ప నష్టపరిహారం చెల్లించడం లేదన్నారు. జిల్లా పక్షాన తాము సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశామని, అయినా పట్టించుకోలేదన్నారు. రూరల్ ఎమ్మెల్యే స్వతహాగా వైద్యుడైనా.. ఒక గ్రామంలో కూడా వైద్య శిబిరం ఏర్పాటు చేయించలేదని పేర్కొన్నారు. బీసీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీలకు రిజర్వేషన్లను కల్పించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని దినేశ్ ఆరోపించారు. రాష్ట్రంలో 12 శాతం ఉన్న మైనారిటీలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. 56 శాతం ఉన్న బీసీలకు పూర్తి 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. తాము మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకుడు న్యాలం రాజు, జిల్లా కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో రాణించాలి




**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో రాణించాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ ముగింపు కార్యక్రమాన్ని నగరంలోని హరిచరణ్ హిందీ విద్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. "క్వాంటం లైఫ్ బిగిన్స్ ప్రాస్పెక్ట్స్ అండ్ ఛాలెంజెస్" అనే అంశంలో అన్ని మండలాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. అనంతరం రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని ఆర్తిని (మెండోరా, జెడ్పీహెచ్ఎస్) అభినందించారు. అలాగే అన్ని మండలాల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్, ఎంఈవో సాయిరెడ్డి, పీఆర్‌టీయూ తెలంగాణ గౌరవ అధ్యక్షుడు కృపాల్ సింగ్, జ్యూరీ మెంబర్లు నరేష్, గోపి వేణుగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద తదితరులు పాల్గొన్నారు.

## గిరిరాజ్‌లో స్పాట్ అడ్మిషన్లు

**అక్షరటుడే, ఇందూరు:** గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 15, 16న స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే దోస్త్ పోర్టల్‌లో ఖాళీ వివరాలను పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అడ్మిషన్ అయిన విద్యార్థుల వివరాలను 17న పోర్టల్‌లో అప్లోడ్ చేయబడుతుందన్నారు. అలాగే 18, 19న మరోసారి వన్ టైం స్పాట్ అడ్మిషన్ ఉంటాయని తెలిపారు. కావున విద్యార్థులు పదో తరగతి ఇంటర్ మెమో, టీసీ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.



## పొలాల్లో ఇసుక తొలగింపు

**అక్షరటుడే, లింగంపేట:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతుల పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సైతం ఈ పొలాలను పరిశీలించారు. దీంతో శుక్రవారం స్పందించిన డీఆర్డీవో సురేందర్ మాట్లాడుతూ.. భారీవర్షాలకు రైతుల పొలాల్లో ఉన్న ఇసుకమేటలను ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలతో తొలగింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, ఎంపీవో, ఏపీవో, టీఏ, ఎఫ్ఏ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.




## 'రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణం'

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. నగరంలోని రూరల్ క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సరిపడినంత యూరియా పంపకుండా కేంద్రం తాత్సారం చేస్తోందన్నారు. దీంతో ఇక్కడి రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలోని బీజేపీ నాయకులకు చీమకుట్టినట్లయినా లేదని ఆయన వ్యాఖ్యానించారు. స్టాక్ పంపాలని విన్నపాలు చేసినప్పటికీ అడపాదడపా యూరియా పంపుతూ ఇక్కడి రైతులను కేంద్రం ఇబ్బంది పెడుతోందని ఆయన పేర్కొన్నారు. జనాభా ప్రాతిప్రతిపాదన ప్రకారం రిజర్వేషన్లు ఉండాలనేది రాహుల్ గాంధీ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. బీసీలు బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రాధాన్యమిస్తుందన్నారు. సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డైరీ ఫాం కార్పొరేషన్ ఛైర్మన్ అమిత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

**అక్షరటుడే, కామారెడ్డి:** రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. సొసైటీల వద్ద నిత్యం బారులు తీరుతున్నారు. యూరియా దొరకకపోవడంతో అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. గురువారం కామారెడ్డి పట్టణంలో రైతులు రోడ్డెక్కిన ఘటన మరువకముందే శుక్రవారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో రైతులు ధర్నా నిర్వహించారు. గ్రామంలో రైతులకు సరిపడా యూరియా ఇవ్వడం లేదని, తెల్లవారుజామున నుంచి క్యూలో నిల్చుంటున్నామని రైతులు వాపోయారు. ప్రతిరోజు సొసైటీ చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా ఇస్తారా లేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోరా సొసైటీ సిబ్బందిని నిలదీశారు. యూరియా కోసం ఉదయాన్నే ముఖాలు కూడా కడుక్కోకుండా లైనులో నిల్చుంటున్నామని, గంటల తరబడి వేచి ఉంటే ఒక్కొక్క పాస్ పుస్తకానికి ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే తమకు సరిపడా యూరియా కోసం ఎన్నిసార్లు సొసైటీల చుట్టూ తిరగాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి తక్షణమే రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.





## కామారెడ్డి బీసీ సభ వాయిదా : మంత్రి సీతక్క

**అక్షరటుడే, కామారెడ్డి :** పట్టణంలో ఈనెల 15న నిర్వహించాలనుకున్న బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మాచారెడ్డి, పాల్వంచ మండల కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశాల్లో ఆమె మాట్లాడారు. బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించామని వివరించారు. బీసీ బిల్లుకు అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. బిల్లును ఆమోదం కోసం గవర్నర్ వద్దకు పంపడం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్‌పై ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సందర్భంలో కామారెడ్డిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని సీతక్క తెలిపారు. వర్షం కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సభ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. సభ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు. 11 ఏళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని మంత్రి విమర్శించారు. దేవుడి పేరిట రాజకీయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వరదలు వస్తే ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కేంద్రంపై వరద సాయం కోసం ఒత్తిడి చేసే పరిస్థితుల్లో లేరన్నారు.

## కేసీఆర్‌ను కలిసిన రాజారాంయాదవ్



**అక్షరటుడే, ఆర్మూర్:** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఓయూ నేత రాజారాం యాదవ్ మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో శుక్రవారం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై మాట్లాడారు.



## మృతుల కుటుంబాలకు పరిహారమివ్వాల్సిందే..

**అక్షరటుడే, బోధన్:** జీపీ తరపున విధులు నిర్వహిస్తూ సిద్ధాపూర్‌లో ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన ఇద్దరికి పరిహారం ఇవ్వాలని మృతుల బంధువులు డిమాండ్ చేశారు. బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలోని పోస్టుమార్టం గది ఎదుట వారు శుక్రవారం ఉదయం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మృతుల బంధువులు, కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. జీపీ తరపున పని చేస్తూ వారు అకాల మరణం చెందినందున ఒక్కొక్కరికి రూ. 50 లక్షల చొప్పున పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. వర్షంలోనూ వారు ధర్నా కొనసాగించారు. సమాచారం అందుకున్న బోధన్ తహశీల్దార్ విఠల్, బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఆందోళనకారులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.



## డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని 9వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ ఖిల్లా రాం మందిర్ మండల అధ్యక్షుడు కోదూరు నాగరాజు డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. వర్షాల కారణంగా డివిజన్లలోని రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. అలాగే డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, సంబంధిత అధికారులను సంప్రదిస్తే తగినంత సిబ్బంది లేదంటూ జవాబిస్తున్నారని తెలిపారు. నాలుగు నెలల నుంచి ఇంటింటి చెత్త సేకరణ బండి రావడంలేదని, దీంతో వ్యర్థ్యాలు పేరుకుపోతున్నాయన్నారు. ఇకనైనా తమ డివిజన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



## కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

**అక్షరటుడే, ఆర్మూర్:** కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. పట్టణంలోని పీవీఆర్ భవన్‌కు మల్‌రెడ్డి రాంరెడ్డి శుక్రవారం విచ్చేసిన సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, ఆర్మూర్ మున్సిపల్ మాజీ మున్సిపల్ ఛైర్మన్లు షేక్ మునుభాయ్, లింగా గౌడ్, అయ్యప్ప శ్రీనివాస్, కౌన్సిలర్లు శాల ప్రసాద్, లీక్కి శంకర్, ఫయాజ్, అథిక్, ఇంతియాజ్, నర్సారెడ్డి, మురళి, డార్లింగ్ రమేష్, నాయకులు విజయ్, సాయినాథ్ కాంగ్రెస్ అజ్జు, ఫయీమ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం.. అనుకున్నంత వేగంగా కొనసాగడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లోపు ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశాలు చేయాలనే సంకల్పం నెరవేరేలా కనిపించడంలేదు. జిల్లాలో వేల సంఖ్యలో ఇళ్లు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. - అక్షరటుడే, ఇందూరు




### ఇందిరమ్మ ఇళ్లు

# పూర్తయ్యేదెన్నడు..

- మందకొడిగా నిర్మాణాలు
- జిల్లాలో కేవలం 13 ఇళ్లు పూర్తి..

జిల్లాలో మొత్తం 17,570 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో సుమారు పదివేల వరకు నిర్మాణాలకు మార్కింగ్ పూర్తి చేశారు. 1,740 ఇళ్ల గోడలు పూర్తయ్యాయి. 6,278 పునాది స్థాయిలో ఉన్నాయి. ఇంకా 7,390 ఇళ్లు ప్రారంభం కాలేవు. జిల్లా వ్యాప్తంగా కేవలం 13 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొంతవరకు ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నా.. నిజామాబాద్ ఆర్మూర్ బోధన్ పట్టణాల్లో మందకొడిగానే కొనసాగుతున్నాయి.

### జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ...

జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఇందిరమైన పథకంపై ప్రత్యేక చొరవ చూపుతున్నారు. అధికారిక సమావేశాల్లో కచ్చితంగా ఇళ్ల పురోగతిపై సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. జిల్లా పర్యటనకు వెళ్లినప్పుడు ప్రత్యక్షంగా ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. అయినా జిల్లాలో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి కనబడడం లేదు. ప్రధానంగా బిల్లులు సమయానికి రావడం లేదా.. ఇసుక కొరతనా.. అనుకున్న స్థాయిలో డబ్బులు సరిపోకవడమో కానీ ఇళ్ల నిర్మాణాలు మాత్రం ముందుకు సాగడం లేదు.

### చిత్రాలు లబ్ధిదారులే అప్‌లోడ్ చేయాలి


ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన యాప్‌లో ప్రభుత్వం కొత్త ఆప్షన్ తీసుకొచ్చింది. బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపడంలో ఎదురవుతున్న జాప్యాన్ని నివారించేందుకు లబ్ధిదారుకే చిత్రాలను అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించింది. ఇంటి నిర్మాణాల దశల చిత్రాలను నేరుగా యాప్‌లో అప్‌లోడ్ చేసే సదుపాయం కల్పించడంతో ఇకపై అధికారుల కోసం నిరీక్షించాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, బల్దియాలో వార్డు అధికారి చిత్రాలను తీసి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో అప్‌లోడ్ చేసేవారు. అవి గృహ నిర్మాణ శాఖ ఏఈ లాగిన్‌కు.. అటు నుంచి డీఈ, పీడీ తర్వాత కలెక్టర్‌కు వెళ్తాయి. ఇలా దశల వారీగా రూ.5లక్షలు లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో జమవుతాయి. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో ఇకపై లబ్ధిదారే నేరుగా చిత్రాలను అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు సంజీవ్ గౌడ్, సునీల్ రెడ్డి చేతులమీదుగా అందజేశారు. మొత్తం ఆరుగురు బాధితులకు రూ.1.36 లక్షల విలువైన చెక్కులు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అరవింద్, విక్కీ యూనిస్, మైనారిటీ అధ్యక్షుడు షేక్ జావిద్, కుందారం శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

## గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ



**అక్షరటుడే, గాంధారి :** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో తరగతుల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, ఆన్‌లైన్ బోధన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆయా తరగతులకు వెళ్లి బోధనా విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. బోధనా పద్ధతులు, విద్యార్థుల భాగస్వామ్యం, క్లాస్ అటెండెన్స్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎఫ్ఆర్ఎస్‌లో అధ్యాపకులు, విద్యార్థుల సమాచారం ఎలా నమోదు చేస్తున్నారనే అంశాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్పష్టంగా, సులభంగా, అర్థమయ్యేలా బోధన జరగాలన్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ గద్దం గంగారాం, అధ్యాపకులు లక్ష్మణ్, రాజగోపాల్, రమేష్, వెంకటస్వామి, సరిత, సుజాత, సంభాజీ తదితరులున్నారు.

## ‘పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీయవద్దు’

**అక్షరటుడే, ఇందూరు:** పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి మాట్లాడటం తగదని పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు షకీల్ పాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత అన్ని దుకాణ సముదాయాలను మూయిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆర్మూర్‌లోని యాసిన్ హోటల్‌ను మూయించామని తెలిపారు. అయితే జీవన్ రెడ్డి తమ ప్రభుత్వం వచ్చాక పింక్ బుక్‌లో పోలీసుల పేర్లు ఎక్కిస్తామంటూ హెచ్చరించినట్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తాము ఎలాంటి పక్షపాతం లేకుండా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నామని వివరించారు. కానీ తమ ఆత్మ స్థైర్యం దెబ్బతినేలా మాట్లాడడం సరైంది కాదన్నారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కష్టపడి రాత్రింబవళ్లు విధులు నిర్వహించామని చెప్పారు.



### సుప్రీంకోర్టు నిబంధనల మేరకే..

సుప్రీంకోర్టు తెలిపిన నిబంధనల ప్రకారం డీజే హై వాల్యూంను నిషేధించడం జరిగిందని షకీల్ పాషా తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసును నమోదు చేశామని చెప్పారు. అది కూడా విధి నిర్వహణలో భాగంగానే చేశామని వివరించారు. కానీ ఎవరిమీద పక్షపాతం లేదన్నారు. పోలీసులను టార్గెట్ చేస్తూ కావాలని కేసులు నమోదు చేశారంటూ ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. సీనియర్ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు రాజన్న, సోమనాథం, ఆనందరావు, సాయిలు, గంగాధర్, జై కిషన్, దత్తాత్రేయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన జర్నలిస్టు నారాయణ అంత్యక్రియలు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నారాయణ అంత్యక్రియలు శుక్రవారం ఆయన స్వగ్రామం మిట్టపల్లిలో ముగిశాయి. నారాయణ మృతదేహం వద్ద రాజకీయ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, వీ6 సీఈవో అంకం రవి తదితరులు నారాయణ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నారాయణను కడసారి చూసేందుకు నాయకులు, పలు సంఘాల నాయకులు, జర్నలిస్టులు తరలివచ్చారు.



## డొంకల్‌లో ఆరోగ్య శిబిరం

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని గౌరారం ఉపకేంద్రంలోని డొంకల్ గ్రామంలో సూర్య ఆరోగ్య సంస్థ సహకారంతో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందల్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆరోగ్య శిబిరంలో ఇందలవాయి వైద్యాధికారిణి షారోన్ షైనీ క్రిస్టినా రోగులందరిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. జ్వరం, దగ్గు, జలుబు, కీళ్లనొప్పులతో బాధపడుతున్న రోగులందరికి చికిత్స చేశారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని గ్రామ కార్యదర్శి రాములును ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ ఆలీ, సూర్య ఆరోగ్య సంస్థ కోఆర్డినేటర్ వినోద్, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తన, మలేహ, సుచరిత, గ్రామ కార్యదర్శి రాములు, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆలూర్ ఎంపీవోగా రాజలింగం బాధ్యతల స్వీకరణ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల పంచాయతీ అధికారి రాజలింగం ఎంపీవోగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కార్యాలయం లో ఎంపీడీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది రాజలింగంకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీవో రాజలింగం మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శులు నవీన్, శేఖర్, దినేష్, నసీర్, కిషోర్, వందన, రానా తరుణం, మండల సూపరింటెండెంట్ లక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ బాల గంగాధర్, కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## జాగింగ్ చేసి ఇంటికి వెళ్తుండగా ఢీకొన్న లారీ

**అక్షరటుడే, కామారెడ్డి :** జాగింగ్ చేస్తూ ఇంటికి వెళ్తుండగా ఇద్దరు యువకులను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రామేశ్వర్ పల్లి పరిధి 44వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. కామారెడ్డి మండలం శాబ్దిపూర్ రైట్ తండాకు చెందిన శివకుమార్ సోలార్ ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. రామేశ్వర్ పల్లి తండాకు చెందిన భదావత్ సంజీవ్ చదువుకుంటున్నాడు. ఇద్దరు కలిసి శుక్రవారం ఉదయం 5 గంటలకు జాగింగ్ కోసమని జాతీయ రహదారిపైకి వెళ్లారు. గంటన్నర తర్వాత జాగింగ్ పూర్తి చేసుకుని ఇంటికి తిరుగుముఖం పట్టారు. కాగా మేఘన దాబా సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ యువకులను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా.. వారిని జీజీహెచ్‌కు తరలించారు. శివకుమార్‌కు తీవ్ర గాయలయ్యాయి.

సీరియస్‌గా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సంజీవ్‌కు జీజీహెచ్‌లో చికిత్స కొనసాగుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు..

**అక్షరటుడే, బోధన్:** ట్రాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీకొట్టిన ఘటన బోధన్ - నాందేడ్ రహదారిపై సాలుర శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి నుంచి బీర్కూర్‌కు వెళ్తున్న ఓ కారు సాలురా శివారులోకి రాగానే.. అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ఆరుగురు యువకులకు గాయాలయ్యాయి. కాగా.. కారు, ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న బోధన్ రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ముదిరాజ్ కులస్తులను బీసీ-డి నుంచి ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవో పార్థసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన ముదిరాజ్ కులస్థులు రాజకీయ, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం,సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. జీవో నెం15 జారీ చేసినా. ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే తమకు న్యాయం చేయాలని కోరారు.



## సార్వజనిక్ దేవి ఉత్సవ కమిటీ కార్యవర్గం ఏర్పాటు

**అక్షరటుడే, బోధన్:** సార్వజనిక్ దేవి ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం బోధన్ శివాలయంలో ఎన్నుకున్నారు. రాబోయే శరన్న వరాత్రులకు ఈ కమిటీ ఏర్పాట్లు చేయనుంది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా నందాల శ్యాం కుమార్, ప్రధాన కార్యదర్శిగా పవన్ కుమార్, కోశాధికారిగా ఉద్మిన్ సందీప్‌తో పాటు పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.